సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ముత్యాలమ్మ పండగ మహోత్సవాలు ప్రారంభం



పండగ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువైయున్న శ్రీ ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ విజయరాఘవస్వామి ఆలయం వద్ద తుంగ్లాం గ్రామాభివృద్ధి యువజన సేవా సంఘం ప్రతినిధులు పండగ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 24వ తేదీ పండగ చాటింపుతో ప్రారంభమై జూలై 6వ తేదీన అమ్మవారి అనుపుతో ఉత్సవాలు ముగుస్తాయని సేవాసంఘం ప్రతినిధులు తెలిపారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో తొలిరోజు అమ్మవారికి విశేష పూజలు చేశారు.

ధూమ్ర వారాహిదేవిగా శ్రీమహాదుర్గ



ఉక్కునగరం: వారాహి నవరాత్రుల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో మహాదుర్గ అమ్మవారిని శనివారం ధూమ్ర వారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర చామంతి పుష్పార్చన చేశారు. మృత్యుదోష నిర్మూలన, శత్రు ఉచ్చాటనం కలిగేలా చేయాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేకువజామున విశేష అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా సాంస్కృతిక మేళా



విద్యార్థినులకు జ్ఞాపిక అందిస్తున్న రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఏ వీక్ టూబీ డిఫరెంట్' పేరిట నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు శనివారంతో ముగిశాయి. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు విద్యార్థులు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈఓ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.రవీంద్ర, డీన్లు బండారు సతీష్, ప్రశాంత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పెదగంట్యాడ: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు గల నిరుద్యోగులకు స్వల్పకాలిక కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చే ఈ శిక్షణకు పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, మిగ్ వెల్డింగ్ కోర్సుల్లో 3 నుంచి 4 నెలలు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు స్కిల్ ఇండియా పోర్టల్‌లో తమ వివరాలను ఈ నెల 29లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. జూలై నుంచి తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ కార్యాలయంలో నేరుగా గానీ, 81217 43777, 91773 38977 ఫోన్ నంబర్ల ద్వారా గానీ సంప్రదించాలని సూచించారు.

ప్రగతి పరవళ్లు



అభివృద్ధి చేసిన బీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన మోడర్న్ లైటింగ్

- రహదారులకు మహర్దశ
- ప్రధాన జంక్షన్ల ఆధునికీకరణ
- రూ.25కోట్లతో చకచకా పనులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బీటీ, సీసీ రోడ్లు, డ్రైన్లు, సామాజిక భవనాలు, కల్వర్టు నిర్మాణాలు, శ్మశాన వాటికల అభివృద్ధికి సంబంధించిన పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే పలు వార్డుల్లో కోట్ల రూపాయలతో పనులు పూర్తి చేయగా, మరికొన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వార్డుకు కోటి నుంచి కోటిన్నర రూపాయల విలువైన అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. జోన్‌లో సాధారణ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన నిధులతో కలుపుకొని సుమారుగా రూ.25 కోట్లతో పనులను చేపట్టినట్టు జోనల్ అధికారులు తెలిపారు.

- 74వ వార్డు దయాల్‌నగర్‌లో రూ.1.10 కోట్లు, 68వ వార్డు మిందిలో రూ.1.10 కోట్లతో యూపీహెచ్‌సీల నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- మింది, సిద్దేశ్వరం, తుంగ్లాం యూపీహెచ్‌సీలకు రూ.48 లక్షలతో ప్రహరీ నిర్మాణాలను చేపట్టారు.
- 66వ వార్డు అజీమాబాద్ ముస్లిం శ్మశానవాటిక వద్ద రూ.90 లక్షలతో వంతెన నిర్మాణం సాగుతోంది.
- 73వ వార్డు చిన నడుపూరులో రూ.11 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- 67వ వార్డు కుంచుమాంబ ఆలయం వెనుక భాగంలో రూ.15 లక్షల వ్యయంతో వీఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టారు.
- 75వ వార్డు గొందేశి వీధిలో రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్స్‌తో సామాజిక భవనం నిర్మిస్తున్నారు.



కణితి రోడ్‌లో వంతెన నిర్మాణం

రహదారుల విస్తరణ, ఆధునికీకరణ

- ట్రాఫిక్ సమస్యలు గట్టెక్కేలా ప్రధాన జంక్షన్లను ఆధునికీకరిస్తున్న విషయం తెలిసిందే. పాతగాజువాక జంక్షన్ విస్తరణ, ఆధునికీకరణ పనులు ఇప్పటికే కొలిక్కి వచ్చాయి. ఇటీవలే లంకెలపాలెం జంక్షన్ విస్తరణ పనులకు భూమిపూజ చేశారు. తాజాగా వందడుగుల రోడ్, ఆటోనగర్ జంక్షన్, శ్రీనగర్ జంక్షన్‌ల ఆధునికీకరణకు భూమిపూజ చేశారు. పెదగంట్యాడ నుంచి సమతానగర్ జంక్షన్ వరకు రూ.1.9 కోట్లతో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే.

శ్మశానవాటికలకు కొత్త రూపు

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో శ్మశానవాటికలు కొత్తరూపు సంతరించుకొంటున్నాయి. 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ శ్మశానవాటికను రూ. 30 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన అధికారులు, మింది శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం 45 లక్షలతోను, అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికను రూ.45 లక్షలతోను అభివృద్ధి చేస్తున్నారు. 71వ వార్డు విశ్వేశ్వరయ్యనగర్ శ్మశాన వాటికను రూ.45 లక్షలతోను, 79వ వార్డు అగనంపూడి శ్మశాన వాటికను రూ.49లక్షలతోను, 85వ వార్డు తలారివానిపాలెం శ్మశానవాటికను రూ.35 లక్షలతోను, 64వ వార్డు యారాడ శ్మశానవాటికను రూ.40 లక్షలతోను అభివృద్ధి చేస్తున్నారు.

- 66వ వార్డు బీసీ రోడ్ అభివృద్ధితో పాటు రూ.35 లక్షల వ్యయంతో సెంటర్ డివైడర్, మోడర్న్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.
- 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో రూ.50 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తుంగ్లాంలోని మార్కండేయ కల్యాణ మండపాన్ని రూ.20 లక్షలతో ఆధునికీకరిస్తున్నారు.
- 87వ వార్డులోని ముస్లిం వీధిలో రూ.16 లక్షలతో రోడ్లు, డ్రైనేజీల పనులను చేపట్టారు.



వుడా కాలనీ పోస్టాఫీస్ బీటీ రోడ్డు

ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో పనులు

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు వార్డు కార్పొరేటర్లు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఇప్పటికే వివిధ పనులను కూడా పూర్తి చేశాం. త్వరలోనే మరికొన్ని పనులకు టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తాం.

– పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

'ఆణిముత్యాల'కు ప్రశంసలు, ప్రోత్సాహకాలు



ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన సాయి హర్షిణి, భావనలకు నగదు, ప్రశంసాపత్రం అందిస్తున్న శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్

అగనంపూడి: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రశంసలు, నగదు బహుమతి లభించాయి. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో శివాజీనగర్‌కు చెందిన కె.వి.శ్రీనివాసబాబు ఎంపీసీలో 972 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన డి.సాయి హర్షిణితో పాటు 960 మార్కులతో ద్వితీయ స్థానం దక్కించుకున్న బి.భావనలకు చెరో రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందించారు. 950 మార్కులు దాటిన మరో 9మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేలు వంతున నగదు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు కాదని వీరు నిరూపించారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో వరుసగా జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన డిగ్రీ విధానంతో బహుముఖ ప్రయోజనం



సదస్సులో ప్రసంగిస్తున్న విష్ణువర్ధన్‌రావు

గాజువాక: 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఏపీ ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన నాలుగేళ్ల డిగ్రీ విధానంతో విద్యార్థులకు బహుముఖ ప్రయోజనం లభించనుందని టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు అన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు నూతన డిగ్రీ విధానంపై తమ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానంలోని బీఎస్సీలో డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, బయో ఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టారన్నారు. బీసీఏ, బీబీఏలలో బిజినెస్ అనలిటిక్స్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు బీకాం వంటి కోర్సులలో అనేక కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఈ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరగడంతో పాటు విదేశీ విద్యను అభ్యసించడం కూడా సాధ్యమవుతుందన్నారు. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియాలాంటి దేశాలలో ఎంఎస్ కోర్సులలో ప్రవేశించడానికి 16 ఏళ్ల విద్యాభ్యాసం పూర్తి చేసిన నిబంధనల ప్రకారం ప్రవేశం పొందవచ్చన్నారు. నాలుగేళ్ల డిగ్రీ విద్యలో భాగంగా సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టులను విద్యార్థులకు వివరించారు.

రామావతారంలో జగన్నాథుడు



నృసింహావతారంలో బలరాముడు, రామావతారంలో జగన్నాథస్వామి



అమ్మవారిని ఆలయానికి తీసుకువెళ్తున్న దేవన్‌రెడ్డి, భక్తులు

అగనంపూడి: జగన్నాథుడి రథోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. 85వ వార్డు ఇంద్రద్యుమ్న హాలు వద్ద బలభద్ర, సుభద్ర సమేతుడై జగన్నాథుడు పూజలు అందుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం జగన్నాథుడు రామావతారంలో దర్శనమీయగా, బలరాముడు నృసింహావతారంలో కొలువుదీరారు. అర్చకుడు గురు సంతోష్ ఉత్సవమూర్తులను అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. హేరా పంచమి సందర్భంగా శ్రీమహాలక్ష్మి దేవి ఇంద్రద్యుమ్న హాలు నుంచి అమ్మవారి ఆలయానికి గరుడ వాహనంలో వెళ్లారు. జగన్నాథస్వామి, అమ్మవారికి మధ్య ఘర్షణ చోటు చేసుకున్న పురాణగాథను అర్చకులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. తరువాత అధిక సంఖ్యలో మహిళలు సహస్ర దీపాలంకరణ చేశారు. మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణం చేయగా, అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సమర, ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, వందల దేవరాజు, గళ్లా శ్రీనుబాబు, పుచ్చా పైడితల్లి, ఆలయ పూర్వీకులు గురు త్రినాథ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డీస్ ఫౌండేషన్ 'జూనియర్ సశక్త్'కు భరణి ఎంపిక

కణితి హైస్కూల్ విద్యార్థిని ఉన్నత విద్యకు ఫౌండేషన్ చేయూత



భరణిని అభినందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు, కణితి హైస్కూల్ ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం: రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జూనియర్ సశక్త్' స్కాలర్‌షిప్‌నకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఆర్.భరణి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఫౌండేషన్ ఇచ్చే స్కాలర్‌షిప్‌నకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఆమె భవిష్యత్తు ఉజ్వలంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ ఫణీంద్రకుమార్, కో–ఆర్డినేటర్ త్రినాథ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీలో ఉద్యోగాల భర్తీకి 27న ఇంటర్వ్యూలు

గాజువాక: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వర్చువల్ రిలేషన్‌షిప్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎన్ఐఐటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. 2020, 2021 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు ప్రస్తుతం డిగ్రీ, పీజీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు కూడా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ పదో తరగతి నుంచి అన్ని తరగతుల్లోను కనీసం 50 శాతం మార్కులను పొంది ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి కనీస వేతనం రూ.4.64 లక్షల ప్యాకేజీ ఉంటుందని తెలిపారు.

పారదర్శకంగా పథకాల అమలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రప్రభుత్వం అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా 74వ వార్డులోని దయాల్‌నగర్ లోవ ప్రాంతంలో శనివారం ఆయన కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలసి పర్యటించారు. లబ్ధిదారులను కలిసి వారికి చేకూరిన లబ్ధిని గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాలుగేళ్ల కాలంలో పారదర్శక పాలన అందిస్తూ అందరికీ లబ్ధి చేకూరుస్తున్నారు. అవినీతి అక్రమాలకు తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసువచ్చారని, వలంటీర్లను నియమించారని తెలియజేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జీవీఎంసీ డీఈ అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, బొడ్డు గోవింద్, ఎస్.రాజారావు, లోకేష్, పాపారావు, గురునాయుడు, చినబాబు, సత్యం, రవి, రామలక్ష్మి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ముత్యాలు ఎన్నిక

పెదగంట్యాడ: శ్రీకృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సంఘం అధ్యక్షునిగా జెర్రిపోతుల ముత్యాలు ఎన్నికయ్యారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు రామాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తలారి వెంకటరమణ, వర్కింగ్ అధ్యక్షునిగా కర్ణం బాబూరావు ఎన్నికయ్యారు. మిగిలిన కార్యవర్గాన్ని 11 రోజుల్లో నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: మహనీయుల త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 863వ రోజు శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులు రోడ్డున పడ్డారని, వారిలో కొంతమందికి మాత్రమే కాంట్రాక్ట్ వర్కర్లుగా ఉపాధి లభించిందని, మిగిలిన వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే వారికి అన్యాయం జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కేంద్రప్రభుత్వ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు

గాజువాక: పేదల ప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్. నర్సింహారావు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన కేంద్ర పథకాల లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ఈ శ్రమ్ కార్డుల ద్వారా అసంఘటిత కార్మికులకు భరోసా వచ్చిందన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా టీకాలు, ప్రతి ఒక్కరికీ ఉచితంగా బియ్యం అందించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, శశిధరన్ పిళ్లై, లలిత, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఐ జాతీయ కార్యదర్శిగా పీఎల్‌కే మూర్తి



ఎన్నికైన సభ్యులు

కొమ్మాది: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రజా సంబంధాల అధికారులు సభ్యులుగా గల భారత ప్రజా సంబంధాల సంఘం (పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీఎల్‌కే మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నికల అధికారి సుభాష్ సూద్ ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాఠక్ ఎన్నికయ్యారు. దక్షిణ భారత విభాగానికి విశాఖకు చెందిన హెచ్‌పీసీఎల్ విశ్రాంత అధికారి యూఎస్ శర్మ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ పీఎల్‌కే మూర్తి విశాఖ పి.ఐ.ఎస్.ఐ చైర్మన్‌గా, కార్యదర్శిగా సేవలు అందించారు.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: నగరంలోని యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. పదో వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీని శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుతో కలసి ఆయన సందర్శించారు. ఇక్కడ యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఏ ఏ వైద్య సేవలు అందుతున్నాయి? ఎంతమంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు? ఇక్కడ మందులు, పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర వాటి గురించి డీఎంహెచ్‌వోని అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలుపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదువుతోందో అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందిపడకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్శనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు శ్రీనివాసరావు, డాక్టర్ సన్యాసిరావు, జోన్–2 జెడ్సీ కనక మహలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

బొండా కుటుంబ సభ్యులకు పరామర్శ



సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న పంచకర్ల రమేష్ బాబు

మహారాణిపేట: ప్రమాదవశాత్తు మృతి చెంది అవయవదానం చేసిన బొండా వెంకట సంతోష్ కుమార్ (వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు సోదరుడు) కుటుంబ సభ్యులను పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు రీజినల్ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కోరికాణ మోహన్‌రావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వరరావు, చొక్కర శేఖర్, జి.విక్టర్, వెంకట్, ధూళి రఘు, నల్లా రవి, పతివాడ కనకరాజు ఉన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని హెచ్‌బీకాలనీకి చెందిన మద్దిల రామారావు, లక్ష్మి దంపతులు లక్షా 1116 రూపాయిల విరాళం ఇచ్చారు. సింహగిరిపై ఉన్న మే ఐ హెల్ప్ యు కేంద్రంలో నగదు రూపంలో దేవస్థానం ఉద్యోగి రాముకి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ అందజేసి స్వామి దర్శనం కల్పించారు.

వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని వినతి

ఉక్కునగరం: కార్మికుల వేతన సవరణపై ఈ నెల 28న జరిగే బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకుని మినిస్ట్రీకి పంపాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు సీఎండీ అతుల్‌భట్‌ను కోరారు. ఉక్కు పరిపాలన భవనంలో శనివారం నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. నూతన వేతనాలు అమలు కాకపోవడం వల్ల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తెచ్చారు. దీనిపై సీఎండీ కంపెనీ పరిస్థితులను వివరించారు. ఆగస్టులో బీఎఫ్–3లో ఉత్పత్తి ప్రారంభించనున్నామని, తద్వారా ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అంతవరకు కార్మికులకు ఐఆర్ చెల్లించాలని కార్మిక నాయకులు కోరగా యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్టు నాయకులు తెలిపారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కొమ్మినేని శ్రీనివాస్, వై.మస్తానప్ప, కరణం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తనిఖీలు

ఎంవీపీకాలనీ: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఎంవీపీ కాలనీతో పాటు గాజువాక, దువ్వాడ, గోపాలపట్నం ప్రాంతాల్లో శనివారం ఈ తనిఖీలు జరిగాయి. లేబర్ డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుల ప్రత్యేక బృందం ఈ తనిఖీలను నిర్వహించింది. పలు షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న బాలబాలికలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. వారిని పనుల నుంచి విముక్తులను చేయడంతో పాటు యజమానులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న విద్యార్థులకు పోటీలు

బీచ్‌రోడ్డు: వికాస తరంగిణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ ఎంఎస్ఎస్ వర్మ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3వ తేదీన నాలుగు అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వివరాల కోసం 99896 95888 నంబరులో సంప్రదించాలన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com